ఇంకెనాళ్లు ఎదురుచూపులు

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఎయిర్‌పోర్ట్ నిర్వాసితులకు ప్లాట్ల కేటాయింపు
- గృహ నిర్మాణాలకు నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం



ఎయిర్‌పోర్ట్ నిర్వాసితులకు కేటాయించిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ స్థలం

గన్నవరం: విమానాశ్రయ విస్తరణలో ఇళ్లు, స్థలాలు కోల్పోయిన నిర్వాసితులు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద గృహ నిర్మాణాలు చేసుకునేందుకు నిధుల కోసం ఎదురుచూస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్వాసితులకు ప్లాట్లు కేటాయించడంతోపాటు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ సమస్యలను ఓ కొలిక్కి తీసుకువచ్చింది. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ స్థలంలో మౌలిక సదుపాయల కల్పన, గృహ నిర్మాణాలకు నిధుల విడుదలకు ఆమోదం కూడా తెలిపింది. తీరా ఎన్నికల కోడ్ రావడంతో నిధులు విడుదల ఆగిపోయింది. ఎన్నికల అనంతరం ప్రభుత్వం మారడంతో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ విషయంలో అడుగు ముందుకు పడటం లేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయినప్పటికి తమ ఊసే ఎత్తడం లేదని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

423 మంది నిర్వాసితులు

విమానాశ్రయ విస్తరణ కోసం 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వం దావాజీగూడెం, అల్లాపురం, బుద్దవరం గ్రామాల పరిధిలో 423 కుటుంబాలకు చెందిన ఇళ్లు, స్థలాలను గుర్తించింది. వీరికి గృహ నిర్మాణాల నిమిత్తం ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద చిన్నఆవుటపల్లి గ్రామ పరిధిలో సుమారు 52 ఎకరాలను సమీకరించారు. సదరు స్థలంలో మెరక పనులు మినహా మౌలిక సదుపాయలు కల్పించక పోవడంతో ప్లాట్ల కేటాయింపు జరగలేదు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్వాసితులతో పలుమార్లు చర్చలు జరిపి లాటరీ పద్ధతిలో ఐదు సెంట్ల చొప్పున ప్లాట్లు కేటాయించింది. నిర్వాసితులు చెల్లించాల్సిన రూ. 3.78 కోట్లు స్టాంప్ డ్యూటీ మినహాయించి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి దస్తావేజులను అందజేశారు. నిర్వాసితుల గృహ నిర్మాణాలకు రెండు దఫాలుగా రూ. 9 లక్షలు ఇచ్చేందుకు అప్పటి ప్రభుత్వం అంగీకరించింది. దీనికిగాను గృహ నిర్మాణాలు, రోడ్లు, డ్రెయిన్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలికసదుపాయల కల్పనకు రూ. 80.48 కోట్లు మంజూరుకు ప్రభుత్వం అంగీకరించింది. నిధులు మంజూరయ్యే సమయానికి ఎన్నికల నియమావళి కారణంగా ఆటంకం ఎదురైంది.

ఇళ్లు ఖాళీ చేయాలని ఒత్తిడి

మరోవైపు భద్రత కారణాల దృష్ట్యా రన్‌వేకు అతిసమీపంలో ఉన్న ఇళ్లను తొలగించాలని ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎప్పటి నుంచో అధికారులపై ఒత్తిడి తీసుకువస్తోంది. అయితే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద గృహనిర్మాణాలు పూర్తయితేగాని నిర్వాసితులు ప్రస్తుతం ఉన్న ఇళ్లను ఖాళీ చేసేందుకు సుముఖత చూపడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం సదరు స్థలంలో రహదారులు, తాగునీరు, విద్యుత్ వంటి కనీస సదుపాయలు కల్పించి, నిధులు మంజూరు చేస్తే గృహ నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని నిర్వాసితులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే కొంత మంది ఎయిర్‌పోర్ట్ డ్రెయిన్ కోసం ఇళ్లు ఖాళీ చేసి అద్దె గృహాల్లో నివాసం ఉంటున్నారు. గత ఎన్నికల ముందు టీడీపీ ఇచ్చిన హామీ మేరకు ఎయిర్‌పోర్ట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఆర్అండ్ఆర్ ప్యాకేజీ స్థలానికి రాకపోకలు సాగించేందుకు వీలుగా ఏలూరు కాలువపై కొత్త వంతెన నిర్మాణం కూడా చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పోరంకిలో మున్సిపాలిటీ కార్మికుల ధర్నా



పోరంకిలో మున్సిపాలిటీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

పెనమలూరు: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోరంకిలో తాడిగడప మున్సిపాలిటీ కార్యాలయం వద్ద బుధవారం కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి మాట్లాడుతూ తాడిగడప మున్సిపాలిటీలో 400 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వీరికి గత డిసెంబర్‌లో చేసిన సమ్మె కాలానికి జీతాలు చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చినా నేటికి జీతాలు ఇవ్వలేదన్నారు. అలాగే కార్మికులకు హెల్త్ ఎలవెన్స్ రూ. 6 వేలు కూడా ఇవ్వలేదని ఆందోళణ వ్యక్తం చేశారు. అనంతరం కార్మికులు ఎమ్మెల్యే బోడె ప్రసాద్, తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ భవానిప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు వై. సరళ, షేక్ మస్తాన్‌వలి, ఎం. ఏడుకొండలు, విజయ, సాంబశివరావు, కార్మికులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అరుణ మేరీ తదితరులు

రామవరప్పాడు: ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో ప్రసాదంపాడు సెయింట్ ఆన్స్ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి మెడల్స్ సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ అరుణ మేరీ తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల ఆరు నుంచి ఎనిమిదవ తేదీ వరకు తిరుపతిలో స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి అండర్-14, 17 విభాగాల్లో తైక్వాండో పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీలకు పాఠశాల నుంచి అండర్-17(63-68) కేజీల బాలికల విభాగంలో ఎస్. నాగవెంకట శ్రీ నిఖ ప్రతిభ కనబర్చి రజితం, బాలుర (48-51) కేజీల విభాగంలో ఎం. మాధవ్ కాంస్య పతకం సాధించారన్నారు. మెడల్స్ సాధించిన విద్యార్థులకు కోచ్ ఎం. అంకమ్మరావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

తెరుచుకున్న మద్యం దుకాణాలు



కేసరపల్లిలో మందుబాబులతో కిక్కిరిసిన మద్యం దుకాణం

కంకిపాడు: ప్రైవేట్ మద్యం దుకాణాలు బుధవారం తెరుచుకున్నాయి. టెండర్ల ప్రక్రియ పూర్తికావడంతో టెండరు దక్కించుకున్న పాటదారులు తమకు అనువైన ప్రాంతాల్లో దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. కంకిపాడు మండలంలోని వివిధ గ్రామాల్లో ఏడు మద్యం దుకాణాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయడంతో ఎక్సైజ్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు. టెండర్లు దక్కించుకున్న పలువురు టీడీపీ నేతలు, సిండికేట్ సభ్యులు మద్యం దుకాణాలను బుధవారం మధ్యాహ్నం నుంచి తెరిచారు. మద్యం విక్రయాలు ఆయా దుకాణాల్లో మొదలయ్యాయి. అయితే మద్యం ధరలు యధావిధిగా ఉండటంతో నాణ్యమైన మద్యం, అన్ని బ్రాండ్లు మద్యం, తక్కువ ధరకు అంటే ఇదేనా అంటూ మందుబాబులు పెదవి విరుస్తున్నారు.

గన్నవరం పరిధిలో అరకొరగా..

గన్నవరం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ ప్రకారం బుధవారం నుంచి ప్రారంభం కావాల్సిన వైన్ షాపులు మండలంలో అరకొర మినహా పెద్దగా అందుబాటులోకి రాలేదు. సిండికేట్‌గా ఏర్పడిన టీడీపీ నేతలకు మద్యం లైసెన్స్‌లు దక్కించుకున్న ఇతర వ్యక్తులకు ఇంకా సయోధ్య కుదరలేదు. లైసెన్స్‌లు దక్కించుకున్న వ్యక్తులు వైన్ షాపుల్లో 50 శాతం షేర్ ఇవ్వాలని, లేనిపక్షంలో సిండికేట్‌లో కలవాలని టీడీపీ నేతలు డిమాండ్లు పెడుతున్నారు. ఈ గొడవల నేపథ్యంలో చాలా వరకు వైన్‌షాపులు ప్రారంభానికి నోచుకోలేదు. మండలంలోని కేసరపల్లి మద్యం దుకాణాన్ని సాయంత్రం 6 గంటలకు ప్రారంభించారు. దీంతో మద్యం దుకాణం మందుబాబులతో కిక్కిరిసిపోయింది.

పాత ధరలకే విక్రయాలు

మద్యం ధరలను గణనీయంగా తగ్గిస్తామని చెప్పిన ప్రభుత్వ ప్రకటనలకు భిన్నంగా ప్రస్తుతం మద్యం ధరలు ఉండటం మందుబాబులకు షాక్ ఇచ్చింది. పాత ధరలకే మద్యం విక్రయాలు జరుపుతున్న ప్రభుత్వం మద్యం ప్రియులను దారుణంగా మోసం చేసిందంటూ పలువురు విమర్శిస్తున్నారు.

నివాసాల మధ్య వైన్ షాపు



అలంకార్ బేకరీ పక్కన ఐరన్ పోల్స్ పాతి మద్యం షాపు నిర్మిస్తున్న దృశ్యం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు బల్లెంవారి వీధిలో నివాసాల మధ్య వైన్ షాపు ఏర్పాటు చేస్తుండటంపై స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ ప్రాంతంలో అలంకార్ బేకరీ పక్కనున్న ఖాళీ స్థలంలో ఎవరికీ అనుమానం రాకుండా వైన్ షాపు ఏర్పాటుకు షెడ్ నిర్మిస్తున్నారు. ప్రసాదంపాడుకు చెందిన ఓ టీడీపీ నాయకుడు గుట్టుచప్పుడు కాకుండా షెడ్ నిర్మాణం చేయిస్తున్నాడు. కాగా ఈ షెడ్ నిర్మాణానికి సంబంధిత అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకపోవడం గమనార్హం. సమీపంలోనే పలు ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు కూడా ఉన్నాయి. పైగా మహిళలు, విద్యార్థులు ఎక్కువగా రాకపోకలు సాగించే ప్రధాన మార్గంలో వైన్ షాపు ఏర్పాటు చేస్తే చూస్తూ ఊరుకోమని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు.

అనారోగ్యంతో హెడ్‌కానిస్టేబుల్ మృతి



కంకిపాడు: అనారోగ్యంతో చికిత్స పొందుతూ కంకిపాడు హెడ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. 2004 బ్యాచ్‌కు చెందిన సింగవరపు బుజ్జిబాబు (48) కంకిపాడు పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. అనారోగ్యంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని సూపర్ స్పెషాలిటీ విభాగంలో చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారుజామున మృతిచెందాడు. ఎస్ఐ డి.సందీప్, పోలీసు సిబ్బంది సంతాపం తెలిపారు.

49 మద్యం సీసాలు స్వాధీనం

ఉంగుటూరు: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులపై ఆత్కూరు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. ఆత్కూరులో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం సీసాలు విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు వారిని సోదా చేయగా వారి వద్ద 49 క్వార్టర్ సీసాలు లభించాయి. దీంతో ఎస్ఐ సురేష్ మద్యం సీసాలు సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

ఇసుక ట్రాక్టర్‌కు జరిమానా

ఉంగుటూరు: ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌కు తహసీల్దార్ విమల కుమారి రూ. 5వేలు జరిమానా విధించారు. నందమూరు క్రాస్ రోడ్డులో ఇసుక లోడుతో వెళుతున్న ట్రాక్టర్‌ను ఉంగుటూరు పోలీసులు బుధవారం తనిఖీ చేశారు. ఈ తనిఖీలో ఇసుకను ఎటువంటి పత్రాలు లేకుండా తరలిస్తున్నట్లు గుర్తించి పోలీసులు సీజ్ చేశారు. అనంతరం ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్, నాగరాజు, విజయ్‌లను ఎస్ఐ గోవిందు ఉంగుటూరు తహసీల్దార్ వద్ద హాజరుపరచగా రూ. 5వేలు జరిమాన విధించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కంకిపాడు: ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి 108 అంబులెన్సుల్లో డ్రైవర్లుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కంకిపాడు డివిజన్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఎం. వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెవీ లైసెన్సు కలిగి ఉండి, పదో తరగతి ఉత్తీర్ణత, ఇంగ్లీష్ చదవడం, రాయడం వచ్చి ఉండాలని, వయో పరిమితి 35 సంవత్సరాల లోపు ఉండాలని పేర్కొన్నారు. ఈనెల 17వ తేదీ 10 గంటలకు భవానీపురంలో మార్కెట్‌యార్డులోని 108 కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9848847042 నంబరును సంప్రదించాలని కోరారు.

20న సూరంపల్లిలో వైద్య శిబిరం

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో ఈనెల 20వ తేదీన ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎంజె. నాయుడు హాస్పిటల్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు వి.రజనీకాంత్ శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

19న ఉచిత మెగా వైద్య శిబిరం

ఉంగుటూరు: కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్, అకిరా కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఈనెల 19న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశీ తెలిపారు. స్థానిక విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ శిబిరంలో గుండె, మెదడు, ఎముకలు, ఊపిరితిత్తులు, రుమటాలజీ(కండరాలు, కీళ్లవాపులు), సాధారణ వ్యాధులను నిపుణులతో పరీక్షలు చేస్తామని తెలిపారు. వైద్య శిబిరాన్ని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఉదయం 8గంటలకు ప్రారంభిస్తారని మరిన్ని వివరాలకు 9505012312 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

పేకాట శిబిరంపై దాడి

పటమట(విజయవాడతూర్పు): ఇంట్లో పేకాడుతున్న శిబిరంపై బుధవారం పటమట పోలీసులు, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. విజయవాడ రూరల్ మండలంలోని ఎనికేపాడులో ఓ నివాసంలో పేకాట జరుగుతోందన్న సమాచారంతో శిబిరంపై మెరుపు దాడి చేశామన్నారు. ఈ దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ. 2,65,000 నగదు స్వాధీనం చేసుకొని పటమట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వారిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

సివిల్స్‌లో విద్యార్థులు ప్రతిభచాటాలి

మంత్రి కొల్లు రవీంద్ర



కానూరులో సివిల్స్ అకాడమీ ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

పెనమలూరు: సివిల్స్‌లో విద్యార్థులు ప్రతిభ చాటాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కానూరులో బుధవారం ప్రతిభ సివిల్స్ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో సివిల్స్‌కు ప్రిపేర్ అవ్వడానికి చాలా దూరం వెళ్లాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు దగ్గరలోనే సివిల్స్ కోచింగ్ అందుబాటులో ఉన్నందున విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. అకాడమీ డైరెక్టర్ జంపాన సుధాకర్ మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ స్థాయి నుంచే సివిల్స్ కోచింగ్ ఇవ్వడం వల్ల విద్యార్థులు విజయం సాధించగలుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వరి పంటకు పొటాష్ వేయాలి



గొడవర్రులో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ కిరణ్



చోడవరంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ శైలజ

పెనమలూరు: వరి పంటకు దోమ ఆశిస్తున్నందున రైతులు యూరియా కాకుండా పొటాష్ వేయాలని మండల వ్యవసాయాధికారిణి కనకమేడల శైలజ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చోడవరం, పెనమలూరు గ్రామాల్లో బుధవారం రైతులకు ఆమె పలు సలహాలు, సూచనలు చేశారు. యూరియా ఎక్కువగా వినియోగించడం వల్ల దోమ వరి పంటను ఆశిస్తుందన్నారు. పంటకు ముఖ్యంగా పొటాష్ వేయాలని.. అలాగే కాంప్లెక్స్ ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. ఈ-క్రాప్ నమోదు పూర్తి అయిందని, గ్రామ రైతు సేవ కేంద్రాల్లో వివరాలు ఉంచామని తెలిపారు. కాగా రబీ పంటలో వరి సాగు చేస్తామని, ప్రభుత్వం తమకు అనుమతి ఇచ్చి పంట కొనుగోలు చేయాలని రైతులు కోరారు. కార్యక్రమంలో వీఏఏ స్మైలీ, సుష్మా, అనూష తదితరులు పాల్గొన్నారు.

కంకిపాడు: మండలంలోని మద్దూరు, గొడవర్రు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి పిఎం కిరణ్ మాట్లాడుతూ పంట పొలాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ తెగుళ్లు, పురుగులను గుర్తించి సకాలంలో వ్యవసాయశాఖ చేసిన సూచనలకు అనుగుణంగా యాజమాన్య చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సబ్సిడిపై టార్పాలిన్ పట్టాలు, తైవాన్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు అందించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన వీఏఏ, వీహెచ్ఏలు అరుణ, శ్రీపావని, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడంతోనే గుర్తింపు



బదిలీ అయిన ఉద్యోగులకు సన్మానం

నున్న(విజయవాడరూరల్): ఉద్యోగస్తులు ప్రజలకు సేవలందించడంతోనే గుర్తింపు వస్తుందని నున్న గ్రామ సర్పంచి కాటూరి సరళ అన్నారు. బుధవారం నున్న గ్రామ పంచాయతీలో బదిలీపై వెళ్లిన జూనియర్ అసిస్టెంటు వై.సుబ్బారావు, బిల్‌కలెక్టర్ బి. లక్ష్మి, వీఆర్వోలు శ్రీనివాసరావు, శంకర్, షేక్ చాంద్‌లకు పంచాయతీ పాలకవర్గం, కార్యాలయ సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. వారి స్థానంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాస కుమార్, నాగేశ్వరరావు, విఘ్నేష్, గోపాలకృష్ణ, అనిల్‌లకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఉపసర్పంచి కలకోటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, మాజీ ఎంపీపీ యర్కారెడ్డి నాగిరెడ్డి, సొసైటీ మాజీ చైర్మన్ పోలారెడ్డి చంద్రారెడ్డి, దండు సుబ్రహ్మణ్యం రాజు, యర్కారెడ్డి కోటిరెడ్డి, కార్యదర్శి జీటీవి. రమణ, పలువురు వార్డు సభ్యులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు తీర్మానం

సర్పంచి అధ్యక్షతన జరిగిన గ్రామ పంచాయతీ సమావేశంలో రూ. 16లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు, రూ. 12 లక్షలతో నిర్మించే డ్రెయిన్లకు తీర్మానం చేశారు. కర్మలషెడ్డు భవనం వెనుకవైపు గంపా బాబురావు దుస్తులు మార్చుకునే గది నిర్మాణంపై సమావేశంలో చర్చ జరిగింది.



తాడిగడప మున్సిపాలిటీలో చెత్త కుప్ప

చెత్త శుద్ధిలేదు

తాడిగడప మున్సిపాలిటీలో సమ్మెతో పేరుకుపోయిన చెత్త

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. గత మూడు రోజులుగా చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లు సమ్మె చేస్తుండటంతో చెత్త తొలగించే వారు లేక పరిస్థితిలు దారుణంగా మారాయి. వివరాల్లోకి వెళితే.. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో తడి, పొడి చెత్త తరలించడానికి 42 వ్యాన్‌లు గతంలో ఏర్పాటు చేశారు. కాంట్రాక్టర్ ద్వారా మున్సిపాలిటీ పరిధిలోని యనమలకుదురు, పోరంకి, కానూరు, తాడిగడప ప్రాంతాల్లో వ్యాన్‌లు చెత్త సేకరించి తరలిస్తున్నాయి. అయితే గతకొద్ది కాలంగా చెత్త తరలించే వ్యాన్ డ్రైవర్లకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదు. గత మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వ్యాన్ డ్రైవర్లు మున్సిపాలిటీ కమిషనర్‌ను కలిసి సమస్య విన్నవించారు. అయినా డ్రైవర్లకు జీతాలు ఇవ్వలేదు. దీంతో డ్రైవర్లు సమ్మెకు దిగడంతో చెత్త తొలగింపు ఆగిపోయింది.

మూడు నెలలుగా జీతాలు లేవు



మాకు గత మూడు నెలలుగా జీతాలు లేవు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాం. జీతాల విషయంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కాంట్రాక్టర్‌తో సమస్యలు వస్తున్నాయి. క్రమం తప్పకుండా జీతాలు ఇస్తే సమస్య ఉండదు.

– నేరెళ్ల, వ్యాన్ డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు, తాడిగడప మున్సిపాలిటీ

దారుణంగా పారిశుద్ధ్యం

వ్యాన్ డ్రైవర్లు సమ్మె బాట పట్టడంతో మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్యం దారుణంగా మారింది. మున్సిపాలిటీలో ప్రత్యమ్నాయంగా ట్రాక్టర్లతో చెత్త తొలగిస్తున్నా ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు ఉంటున్నాయి. వర్షం పడితే తీవ్ర దుర్గంధం వస్తుంది. పారిశుద్ధ్యం క్షీణిస్తే వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు ఆందోళణ చెందుతున్నారు. అధికారులు చెత్త తొలగించే విషయంలో చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com

క్లుప్తంగా

నాలా కన్వర్షన్ భూముల పరిశీలన

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చుకునేందుకు దరఖాస్తులు రావడంతో విజయవాడ సబ్‌కలెక్టర్ కె. చైతన్య బుధవారం ఆ భూములను పరిశీలించారు. ఆర్ఎస్ నెంబరు 808లో 72 సెంట్లు, 746 సర్వే నెంబర్లో 36 సెంట్లు, 736 సర్వే నెంబర్లో మరో భూమిని సబ్‌కలెక్టర్ పరిశీలించారు. సబ్ కలెక్టర్‌తోపాటు మండల తహసీల్దార్ బి.సుగుణ, డెప్యూటీ తహసీల్దార్ బేబి సరోజిని, ఆర్ఐ రాజేష్, వీఆర్వోలు, సర్వేయర్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ పరమేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం పటేల్‌నగర్, సాయినగర్, హనుమాన్‌నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లైఓవర్ దిగువ ప్రాంతం, రైల్వే స్టేషన్ కట్ట ప్రాంతాల్లో సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.

నారాయణ కాలేజీ గుర్తింపు రద్దు చేయాలి

వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రవిచంద్ర డిమాండ్

పెనమలూరు: కానూరు నారాయణ కాలేజీ శివాని క్యాంపస్‌లో ఫీజులు చెల్లించలేదనే కారణంతో రోడ్డుపై విద్యార్థులను నిలబెట్టడం దారుణమని వెంటనే కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర డిమాండ్ చేశారు. ఆయన బుధవారం ప్రకటనలో వివరాలు తెలుపుతూ ఫీజుల కోసం విద్యార్థులను వేధించి ఎండలో నడి రోడ్డుపై నిలబెట్టడం దారుణమన్నారు. ఈ ఘటనపై విచారణ చేసి నారాయణ కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని కోరారు. విద్యార్థుల నుంచి లక్షల ఫీజులు వసూళ్లు చేసి దండుకుంటున్న మంత్రి నారాయణ, కాలేజీపై చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటర్ బోర్డు నిబంధనలు నారాయణ కాలేజీ పాటించనందున మంత్రి నారాయణపై క్రిమినల్ కేసు చేయాలని డిమాండ్ చేశారు.

బాలుడి చికిత్సకు ఆర్థిక సాయం



పెనమలూరు: విజయవాడకు చెందిన ఇంగువ అవినాష్(13) అనే బాలుడు బ్రెయిన్ న్యూరాజికల్ హెల్త్ డిజార్డర్‌తో బాధపడుతున్నాడు. దీంతో పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు బాలుడికి ఆర్థిక సాయం అందించారు. కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బాలుడి శస్త్ర చికిత్సకు రూ. 60,250 ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు ద్వారా అందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను అభినందించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్యామ్, విద్యార్థులు పాల్గొన్నారు.


150 మందికి వైద్య పరీక్షలు

పెనమలూరు: కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ డీమ్డ్ టుబి యూనివర్సిటీలో బుధవారం ఉచిత వైద్య శిబిరం జరిగింది. కాలేజీ ఎన్ఎస్ఎస్ యూనిట్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ, గ్లోబల్ డాక్టర్స్ సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మందికి 2డీ ఎకో, కిడ్నీ స్కాన్, ఊపిరితిత్తులు, దంత, కంటి పరీక్షలు చేశారు. వైద్యులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

పేరంటాలమ్మ హుండీ ఆదాయం రూ. 6.63 లక్షలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మకు హుండీల ద్వారా రూ. 6,63,196 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. ప్రియాంక తెలిపారు. ఆలయ ప్రాంగణంలోని హుండీలను బుధవారం దేవదాయశాఖాధికారి సృజన్ పర్యవేక్షణలో లెక్కించారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా ఈ ఆదాయం వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, సాయి సేవాదళ్ సభ్యులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ



ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యాన గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. తేలప్రోలు గ్రామంలో సుమారు 250 గొర్రెలు, 95 మేకలకు డాక్టర్ మల్లిబాబు నట్టల నివారణ మందులు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లాం దిబోర, టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి పాల్గొన్నారు.